ఉపాధి హామీలో క్యాటిల్ పనులు ప్రారంభం

కొండాపూర్, నవంబర్ 26: ఉపాధి హామీ పనుల జాతరలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని మల్లేపల్లి, గంగారం, కొండాపూర్ గ్రామాలతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో కొండాపూర్ ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధి హామీలో క్యాటిల్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి హామీ నిధులు రూ.70 వేలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ మర్రి ప్రదీప్, ఏపీవో వీరప్ప, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

కోహీర్, నవంబర్ 26: మండలంలోని దిగ్వాల్ శివారులోని ఒప్పోన్ గ్యాస్ కంపెనీ సమీపంలో ఓ వ్యక్తి మృతదేహం లభించిందని ఎస్సై సతీశ్ మంగళవారం వెల్లడించారు. మృతి చెందిన వ్యక్తి వయసు 40 సంవత్సరాలు ఉంటుందన్నారు. బ్రౌన్ రంగు ప్యాంటు, ఎరుపు రంగు డ్రాయర్ ధరించి ఉన్నాడని, అతడి మృతదేహాన్ని జహీరాబాద్ దవాఖానలోని మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. ఎవరైనా అతడిని గుర్తిస్తే కోహీర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

కార్మికులకు స్వెట్టర్లు పంపిణీ

కోహీర్, నవంబర్ 26: కోహీర్ గ్రామ పంచాయతీ కార్మికులకు మంగళవారం దాత సహాయంతో స్వెట్టర్లను అందజేశారు. రోజూ ఉదయం చలిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల అవసరాలను గుర్తించిన దాత అన్నాన్ జావిద్ స్వెట్టర్లను సమకూర్చారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో కార్మికులతో సమావేశం నిర్వహించి ఎంపీడీవో భారతి, కార్యదర్శి మిస్కీన్, మాజీ వైస్ ఎంపీపీ జావిద్, మాజీ వార్డు సభ్యుడు నిసార్ ఆహ్మద్, ఫిర్దోస్, తదితరులు వాటిని పంపిణీ చేశారు.

మాలలు హైదరాబాద్‌కు తరలిరావాలి

కోహీర్, నవంబర్ 26: డిసెంబర్ ఒకటో తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే మాలల సింహ గర్జనకు ఆయా గ్రామాల నుంచి ప్రతిఒక్కరూ తరలిరావాలని సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు కరణం రవికుమార్ కోరారు. మంగళవారం కోహీర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద చలో హైదరాబాద్ గోడ పత్రికను విడుదల చేశారు.

శబరిమలకు అయ్యప్ప స్వాములు

హత్నూర, నవంబర్ 26: మండలంలోని నస్తీపూర్ రామాలయం అయ్యప్ప స్వాములు మంగళవారం ఇరుముడితో శబరిమల తరలివెళ్లారు. మండలదీక్షలు చేపట్టిన అయ్యప్పస్వాములు ఉదయం, సాయంత్రం అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేసి ఇరుముడితో అయ్యప్ప స్వామిని దర్శించుకోవడానికి తరలివెళ్లారు. రామాలయంలో గురుస్వాములు ఆంజనేయులు, కన్నయ్య స్వాములు ఇరుముడి కట్టి పూజలు చేశారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన చేశారు.

నాయీ బ్రాహ్మణ మండల కమిటీ ఎన్నిక

హత్నూర, నవంబర్ 26: హత్నూర మండల నాయీ బ్రాహ్మణ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వీరే శంనాయి, గౌరవ అధ్యక్షుడిగా ఎల్లేశ్‌నాయి, ఉపాధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి లింగం, వర్కింగ్ ప్రెసిడెంట్ భిక్షపతి, కోశాధికారి లక్ష్మణ్, ఉపకోశాధికారి వీరస్వామి, ముఖ్య సలహాదారులు నర్సింహులు, వెంకటయ్య, కార్యదర్శులు దుర్గయ్య, వెంకటేశం, మహేశ్, కార్య నిర్వాహకులు అనిల్, రమేశ్, రాజేశ్‌తోపాటు సలహాదారులను ఎన్నుకున్నారు.

వెలగని వీధి దీపాలు

హత్నూర, నవంబర్ 26: మండలంలోని పల్సానూర్‌లో కొద్ది రోజులుగా పలు వార్డుల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు గుర్తించి వీధి దీపాలు ఏర్పాటుచేసి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

జహీరాబాద్, నవంబర్ 26: న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. జహీరాబాద్ జనవిజ్ఞాన వేదిక కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని మిర్జాపూర్(బి) జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రథమ, న్యాల్‌కల్ జల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జహీరాబాద్ జనవిజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు రాంచంద్రయ్య, మాజీ జనవిజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం అమృత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్: తారా కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. 75 రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత రాజ్యాంగం విశిష్టమైనదని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలకు కలెక్టర్ వల్లూరు క్రాంతి హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, నవంబర్ 26

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 26: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పదో తరగతిలో మెరుగైన ఫలితాల సాధన, సమగ్ర శిక్షా కార్యక్రమాలు, సర్వీస్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. పదోన్నతి పొందిన జిల్లాలోని ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు భోజనం చేసేలా పట్టిక రూపొందించాలన్నారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం, ఎస్‌పోపీపై జీసీడీవో మాధవి తదితరులు పాల్గొన్నారు.

ముత్తంగిలో చెత్తకు నిప్పు

ఊపిరాడక ఉక్కిరిబిక్కిరైన స్థానికులు, వాహనదారులు

ఐడీఏ పాశమైలారం రోడ్డుపై సాయంత్రం చెత్త తగులబెట్టడంతో ఏర్పడిన పొగ

పటాన్‌చెరు, నవంబర్ 26: తెల్లాపూర్ మున్సిపాలిటీ ముత్తంగిలో భారీగా పోగైన చెత్తను మున్సిపల్ సిబ్బంది తగులబెట్టారు. మంగళవారం పాశమైలారం ఐడీఏ వెళ్లే రోడ్డు పక్కన గుంతల్లో పోగైన మున్సిపల్ చెత్తను సాయంత్రం సిబ్బంది నిప్పుపెట్టి తగులబెట్టారు. దీంతో దట్టమైన పొగలు ముత్తంగి గ్రామాన్ని, కాలనీలను చుట్టుముట్టాయి. దుర్వాసనతో కూడిన, ఘాటైన వాసనలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ఈ గుంతల్లో చెత్త వేస్తున్నారని గతంలో విమర్శలు రాగా మున్సిపల్ కమిషనర్ కొల్లూరులోని చెత్త డంపింగ్‌యార్డుకు తరలించాలని సిబ్బందికి ఆదేశించారు. పట్టించుకోని మున్సిపాలిటీ ఉద్యోగులు చెత్త సేకరణ వాహనాలనుంచి వస్తున్న చెత్తను రోడ్డు పక్కనే వేస్తున్నారు. భారీగా చెత్త పోగవగానే సిబ్బంది తగులబెడుతున్నారు. చెత్తను తగులబెట్టవద్దని ప్రభుత్వ ఆదేశాలున్నా తెల్లాపూర్ మున్సిపాలిటీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. చెత్తను కొల్లూరు డంప్‌యార్డుకు తరలించాలని ముత్తంగి వాసులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

రహదారుల అభివృద్ధికి పెద్దపీట

వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

అందోల్: మాసాన్‌పల్లి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మంత్రి దామోదర

అందోల్/పుల్కల్, నవంబర్ 26: రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నదని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం మండలంలోని మాసాన్‌పల్లి, రోళ్లపాడు గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్లు బాగుండి రవాణ వ్యవస్థ మెరుగు పడినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. పుల్కల్ మండల పరిధిలోని కోడూరు నుంచి కొండారెడ్డిపల్లి వరకు 7.1 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి 4.69 కోట్లు సీఆర్ఆర్ నిధులు మంజూరు కావడంతో మంత్రి దామోదర పనులు ప్రారంభించారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ జగదీశ్, ఆర్డీవో పాండు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఉపాధ్యాయుడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, నవంబర్ 26: నారాయణఖేడ్ పట్టణానికి చెందిన ఎంబీఆర్ కాలనీలో నివాసం ఉంటున్న మార్డి తండాకు చెందిన ఉపాధ్యాయుడు హరినాయక్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆయనను కలిసి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ జిల్లా మాజీ సభ్యుడు రవీందర్‌నాయక్ ఉన్నారు.

రోడ్లు, పాఠశాలల అభివృద్ధికి కృషి

రాయికోడ్, నవంబర్ 26: రాయికోడ్ మండలంలోని రోడ్లు, పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని శంశోద్దిన్‌పూర్‌లో రూ.3లక్షలతో మహిళలకు కోళ్ల పెంపకం షెడ్ నిర్మాణం, మండల కేంద్రమైన రాయికోడ్‌లో ప్రాథమిక పాఠశాలకు రూ.14 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు మైరుగైన వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఎం షరీఫ్, ఎంపీవో అంజాలిదేవి, ఏఈ దేవయ్య, ఉపాధిహామి అధికారులు విష్ణు, రమేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములు, నాయకులు కేదారినాథ్‌పాటిల్, రామకృష్ణ, మహకాళి, సతీశ్, దుర్గేశ్ ఉన్నారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి

బొల్లారం, నవంబర్ 26: పారిశ్రామికవాడలోని పేద గర్భిణుల కోసం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కార్పొరేట్ వైద్య సేవలను అందించడం అభినందనీయమని బొల్లారం మున్సిపల్ వైర్‌పర్సన్ కోలన్ రోజా బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పాత కార్యాలయ ఆవరణలో పీబీఆర్ దవాఖాన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవా భావంతో వైద్య బృందం శిబిరంలో పాల్గొన్న గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి, దవాఖాన యాజమాన్యం శ్రీకాంత్ రెడ్డి, విద్యాకాంత్ రెడ్డి, దవఖాన వైద్యులు కృష్ణ కాంత్ రెడ్డి, శ్రీవీణ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

ముసిపల్లి, నవంబర్ 2: రెండు రోజులుగా తాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని చిన్నచెల్మడ గ్రామస్తులు మంగళవారం పంచాయతీ కార్యదర్శిని అడిగారు. అందుకు ఆయన 'పంచాయతీలో డబ్బులు లేవు.. నేనేమి చేయాలి' అని నిర్లక్ష్యపూరిత సమాధానం ఇవ్వడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివారణ కోరగా గ్రామంలో రెండు రోజుల నుంచి తాగు నీరు రాకపోవడం వాస్తవమేనని.. గ్రామంలో ఇప్పటికే నాలుగుసార్లు బోరు పడైపోతే బాగు చేయించామన్నారు. బుధవారం పాడైన బోరు మోటర్‌కు మళ్లీ మరమ్మతులు చేయించి తాగునీటిని సరఫరా చేస్తామని చెప్పారు.

షెడ్లను కూలగొట్టడం అన్యాయం

రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన బాధితులు

ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ హనుమంతు

రాయికోడ్, నవంబర్ 26: పైసా పైసా కూడబెట్టుకొని కొనుగోలు చేసి రేకుల షెడ్లను నిర్మించుకున్నామని.. షెడ్లను తొలిగించడం అన్యాయమని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం రాయికోడ్ శివారులోని 285 సర్వే నంబర్‌లో పలువురు నిర్మించుకున్న రేకుల షెడ్లను పోలీస్ బందోబస్తు మధ్య జేసీబీల సహాయంతో తొలిగించే ప్రయత్నం చేశారు. ఇంతలో లబ్ధిదారులు తేరుకుని రెవెన్యూ అధికారులు, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. గతంలో ఈ భూమిని ఎస్సీలకు పంపిణీ చేశారు. వారి వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఇతరులకు లీజుకు ఇచ్చారు. కొందరు ఈ భూముల్లో తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేసుకొన్నారు. సమీపంలోని రాయికోడ్ కూడలి, చిమ్నాపూర్ గ్రామాల్లో అక్రమంగా నిర్మించుకున్న భవనాలు, వ్యాపార సముదాయాలు తొలిగించాకే తమవి తొలిగించాలని ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు చేపట్టడం చట్ట విరుద్ధమని పలుమార్లుహెచ్చరించినా ఫలితం లేకుండా పోయిందని, ఈ క్రమంలోనే షెడ్లను తొలిగించాల్సి వచ్చిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలిగించినట్లు తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ విజయకుమార్ తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి

జహీరాబాద్, నవంబర్ 26: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చిందన్నారు. వీటిని 2025లోఅమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, వాటికి వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేల ఇవ్వాలని, ఉపాధి హామీ పథకం కింద కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రోజుకు కూలీలకు రూ.600 వేతానాన్ని ఇవ్వాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్డీవో రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, గణేశ్, నరేశ్, మోహన్, సంజీవ్ పాల్గొన్నారు.

జహీరాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు, కార్మికులు

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి

పనులను ప్రారంభిస్తున్న జిల్లా కార్మికశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి

జహీరాబాద్, నవంబర్ 26: ఉపాధి హామీ పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గంలోని న్యాల్‌కల్, మొగుడంపల్లి, జహీరాబాద్ మండలాల ప్రత్యేకాధికారులు, జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, డీడీ గోపాల్ సింగ్ అన్నారు. ఊరురా ఉపాధి హామీ పనుల్లో భాగంగా మండల కేంద్రమైన న్యాల్‌కల్, మొగుడంపల్లి, జహీరాబాద్ మండలంలోని అనెగుంట గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద రైతులకు ఉపయోగపడే పశువుల పాకల నిర్మాణం, పాడికి ఉపయోగపడే గడ్డి పెంపకం, వర్మీ నాడెపు కంపోస్టు యూనిట్లు, పెంటకుప్పల తవ్వకం, ఎస్సీ, ఎస్టీ పోడు భూముల్లో అభివృద్ధి పనులు, నర్సిరీలు, జల నిధి పనులను చేపట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన తహసీల్దార్లు భూపాల్, అసీనాబేగం, ఎంపీడీవోలు మహేశ్, రాజశేఖర్, మహేందర్‌రెడ్డి, ఎపీవోలు రంగారావు, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రేశంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

పటాన్‌చెరు, నవంబర్ 26: ఇంద్రేశం గ్రామంలో అక్రమంగా బహుళ అంతస్తులను నిర్మిస్తున్న బిల్డర్లపై చర్యలు మొదలయ్యాయి. అనుమతులు లేకుండా పైఅంతస్తులు వేస్తున్న రెండు నిర్మాణాల స్లాబ్‌లను గ్రామ కార్యదర్శి సుభాష్ ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ సిబ్బంది కూల్చివేశారు. స్లాబ్ కటింగ్ మెషిన్లు వాడి స్లాబ్‌ను తొలిగిస్తున్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ ఇంద్రేశంలో రెండు రోజులుగా నాలుగు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎక్కడైనా, ఎవరైనా అనుమతులు లేకుండా బహుళ అంతస్తులను నిర్మిస్తే కూల్చివేస్తామని హెచ్చరించారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం కఠిన చర్యలుంటాయన్నారు.

'అస్తవ్యస్తంగా యూజీడీ నిర్మాణ పనులు'

యూజీడీ నిర్మాణ పనులపై అసహనం వ్యక్తం చేస్తున్న బస్తీ వాసులు

బొల్లారం, నవంబర్ 26: మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు బీరప్ప బస్తీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా కొనసాగుతున్నాయని మాజీ వార్డు సభ్యుడు భాస్కర్ స్థానికులతో కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు పనులు జరుగుతున్న తీరుపై ఆరా తీయాలని కోరారు. చిన్న పైపులను కాకుండా పెద్ద పైపులను ఉపయోగిస్తూ నిర్మాణం చేపట్టాలని కోరారు. లేనిచో భవిష్యత్తులో పారిశుధ్య సమస్యలు తలెత్తుతాయని వాపోయారు. పాత వాటి స్థానంలో కాకుండా రోడ్డు మధ్య నుంచి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

సకాలంలో ఆస్తి పన్ను చెల్లించాలి

ఆర్వో నర్సింలుకు ఆస్తి పన్ను చెల్లిస్తున్న సుజనా స్టీల్ పరిశ్రమ ప్రతినిధులు

బొల్లారం, నవంబర్ 26: పరిశ్రమల యాజమాన్యాలు సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ ఆర్వో నర్సింహులు కోరారు. మంగళవారం పారిశ్రామిక వాడలోని సుజనా స్టీల్స్ పరిశ్రమ యజమానులు చెల్లించాల్సిన రూ.31,87,548లను చెక్కు రూపంలో ఆర్వోకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్లు నిర్మలారెడ్డి, మల్లికార్జున్, బిల్ కలెక్టర్లు మహబూబ్ అలీ, రఘురాం రెడ్డి, ప్రదీప్, అలీ, నారాయణ, సీనియర్ అకౌంటెంట్ శ్రీకాంత్, కార్యాలయ సిబ్బంది మహేందర్ పాల్గొన్నారు.

దళారులపై చర్యలు తీసుకోవాలి

బ్లాక్‌లో పత్తిని కొనుగోలు చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాయకులు

సదాశివపేట, నవంబర్ 26: రైతులను మోసం చేస్తూ బ్లాక్ మార్కెట్‌లో దర్జాగా పత్తిని కొనుగోలు చేస్తున్న దళారులపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, ఏరియా కార్యదర్శి ప్రవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని మద్దికుంట చౌరస్తా వద్ద బ్లాక్‌లో పత్తిని కొనుగోలు చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనూ రైతుల నుంచి దళారులు పత్తిని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం పత్తి క్వింటాల్‌కు రూ. 10 వేలు మద్దతు ధర చెల్లించి రైతులను ఆదుకోవాలన్నారు. నాయకులు భూషణం, అనిల్, శ్రీనివాస్, మల్లేశ్, రామేశ్‌గౌడ్, అశోక్, ఎండీ ఖయ్యూం, ఏసేబు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల రక్తదాన శిబిరం

జహీరాబాద్, నవంబర్ 26: ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని ఆదుకునేందుకు ఎన్‌సీసీ విద్యార్థులు రక్తదానం చేయడం అభినందనీయమని జహీరాబాద్ పట్టణ సమీపంలోని రంజోల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్వర్ణలత అన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్‌సీసీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో విద్యార్థులు రక్తదానం చేశారు.

వరి కొయ్యలను పొలంలోనే కలియదున్నాలి

అందోల్, నవంబర్ 26: రైతులు వరి కొయ్యలను కాల్చకూడదని, భూమిలోనే కలియదున్నాలని మండల వ్యవసాయ అధికారి శ్రీహరి అన్నారు. మంగళవారం జోగిపేటలోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ వరి కొయ్యలను కాల్చడం వల్ల నేల భూసారాన్ని కోల్పోతుందన్నారు. కొయ్యలను కాల్చడం వల్ల వచ్చే వాయు కాలుష్యంతో పంటలకు మేలు కంటే సూక్ష్మ జీవులు చనిపోతాయన్నారు.

పశువులు, పందుల సంచారంపై నజర్

నారాయణఖేడ్, నవంబర్ 26: నారాయణఖేడ్‌లో రోడ్లపై సంచరిస్తూ వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు గురి చేస్తున్న పశువులు, పందులను యజమానులు కట్టడి చేసుకోవాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని కమిషనర్ జగ్జీవన్ హెచ్చరించారు. యజమానులు తమ పశువులు, పందులను రోడ్లపైకి రాకుండా శుక్రవారం లోపు కట్టడి చేయాలన్నారు. లేని పక్షంలో పశువులను గోశాలకు, పందులను ఇతర ప్రాంతాలకు తరలిస్తామన్నారు. వాటిని తరలిస్తున్న క్రమంలో అడ్డుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

చివరి ఆయకట్టుకూ నీరందిస్తాం

నారాయణఖేడ్: రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

కల్హేర్/సిర్గాపూర్, నవంబర్ 26: యాసంగిలో నల్లవాగు ప్రాజెక్టు చివరి ఆయకట్టుకు నీరందించేందుకు కృషి చేస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఒకవేళ పంటలకు నీరందకపోతే సింగూరు ప్రాజెక్టు నుంచి లిఫ్ట్ ద్వారా సగం టీఎంసీ నీటిని నల్లవాగు ప్రాజెక్టులోకి తరలించేందుకు ప్రభుత్వానికి రూ.90కోట్ల నిధులతో ప్రతిపాదనలు పంపించామని త్వరలో మంజూరు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. మంగళవారం కల్హేర్, సిర్గాపూర్ మండలల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

నారాయణఖేడ్, నవంబర్ 26: మండలంలోని గునుకులకుంట నుంచి పెద్దశంకరంపేట మండలం బద్దూరం వరకు రూ.2.10 కోట్ల నిధులతో ఏర్పాటు చేయనున్న బీటీ రోడ్డు పనులకు మంగళవారం ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మారుమూల గ్రామాలు, తండాలకు సైతం మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రాకేశ్ శెట్కార్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేటలో..

నిజాంపేట్, నవంబర్ 26: మండల కేంద్రంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ నిర్మాణాలకు ఉపాధి హామీ పథకం కింద రూ.10 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. పోచ్చట్‌పల్లి గ్రామానికి రెండు కిలోమిటర్ల మేర రూ.1.72 లక్షలతో నిర్మించనున్న బీటీ